
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
శనివారం 28 జూన్ 2025



బీటెక్ ఫైనల్ సెమిస్టర్ ఫలితాలు విడుదల
7
కీచక ఉపాధ్యాయుడు సస్పెన్షన్

జిల్లాకు బాసటగా బిల్‌గేట్స్ ఫౌండేషన్

● కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప కలెక్టరేట్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రామీణ ప్రజల పౌష్టికాహారం మెరుగు పరిచేందుకు ఐఎస్‌బీ బిల్‌గేట్స్ ఫౌండేషన్ బాసటగా నిలుస్తోందని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. ఎనాక్స్ (ఎనేబుల్ అగ్రికల్చర్ న్యూట్రిషన్ కన్వర్జేన్స్ త్రు టెక్నికల్ సపోర్ట్)లో భాగంగా జిల్లాలో పౌష్టికాహారం పెంపొందించడానికి కలెక్టర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆన్లైన్ జూమ్ మీటింగ్ జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బిల్ గేట్స్ ఫౌండేషన్ సహకారంతో మహిళలకు, పిల్లలకు పౌష్టికాహారం అందించేందుకు జిల్లాలో మొదట చింతకొమ్మదిన్నె, జమ్మలమడుగు మండలాల్లో అమలు చేసి తరువాత జిల్లా వ్యాప్తంగా అమలు చేసేందుకు ఒప్పందం కుదిరిందన్నారు. పౌష్టికాహారం, ప్రొటీన్ ఆహార పదార్థాలు కొనలేని స్థితిలో ఉన్న వారందరికీ సరసమైన ధరల్లో బహుళరంగ మార్కెట్ల ద్వారా అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. పోషకాహారాన్ని అందించడానికి డిజిటల్ ఓచర్లను కూడా అందుబాటులోకి తెస్తామని, వీటి ద్వారా న్యూట్రీషన్ ఫుడ్‌ను బయట మార్కెట్లో తక్కువ ధరకే పొందవచ్చన్నారు. కడప జిల్లాను లీడింగ్ హార్టికల్చర్ హబ్‌గా మార్చడంలో భాగంగా పండ్లతోటలపై దృష్టి సారించి న్యూట్రిషన్ ఆహారపదార్థాలను అందుబాటులోకి తెస్తున్నామన్నారు.

భూసేకరణ త్వరగా పూర్తి చేయాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జేసీ అదితిసింగ్

కడప కలెక్టరేట్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారుల విస్తరణ కోసం చేపట్టిన భూ సేకరణ త్వరగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి సంబంధిత అధికారులు, ఆయా మండలాల తహశీల్దార్లతో జేసీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ దేశంలో రవాణా వ్యవస్థను మరింత సులభతరం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాయన్నారు. అందులో భాగంగా బెంగళూరు-కడప-విజయ వాడ జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి భూసేకరణ చేపట్టామన్నారు. జాతీయ రహదారులు, రైల్వే నిర్మాణం, వాటి అభివృద్ధికి అదనంగా చేపడుతున్న భూసేకరణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. తాజాగా కడప-రేణిగుంట జాతీయ రహదారికి ఫారెస్ట్ క్లియరెన్స్ లభించిందన్నారు. అలాగే రోడ్డు విస్తరణ ప్రాజెక్టు పనులకు సంబంధించిన ప్రతిపాదనలు, అనుమతులకు సంబంధించిన ఫైళ్లను రెవెన్యూ అధికారులు వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్ఏఐ ఎస్డీసీ వెంకటపతి, ఆర్అండ్‌బీ నేషనల్ హైవే ఈఈ విజయభాస్కర్ రెడ్డి, డీఎఫ్ఓ వినీత్ కుమార్, ఆర్డీవోలు, వెన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు.

డీకేటీల జాతర

● వైసీపీ హయాంలో ఇష్టారాజ్యంగా ప్రభుత్వ భూముల పంపిణీ



జగన్ ఐదేళ్ల పాలనలో పులివెందుల నియోజకవర్గంలో డీకేటీ భూముల జాతర సాగింది. దక్కించుకున్నోడికి దక్కించుకున్నంత అన్న రీతిలో ఈ వ్యవహారం నడిచింది. డీకేటీ పట్టా కావాలంటే పలుకుబడి, ముడుపులు ఇచ్చే స్థోమత ఉంటే చాలు.. పులివెందుల నియోజకవర్గంలో దాదాపు 30 వేల నుంచి 40వేల ఎకరాల ప్రభుత్వ భూమి డీకేటీ పట్టాల రూపంలో చేతులు మారిందని అంటున్నారు. ప్రస్తుతం మూడు మండలాల్లో భూపంపిణీ వ్యవహారంపై కూటమి ప్రభుత్వం విచారణ సాగిస్తోంది. దీంతో అక్రమంగా భూమి పంపిణీ చేసిన రెవెన్యూ అధికారులు, భూములు పొందిన వారిలోనూ అలజడి మొదలైంది.

● మూడు మండలాల్లో భూ పంపిణీపై సాగుతున్న విచారణ
● మిగిలిన మండలాల్లో కూడా అదే తరహా పందేరం

పులివెందుల, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పులివెందుల నియోజకవర్గంలో 2019-2024 మధ్యలో కనివినీ ఎరుగని స్థాయిలో భూపంపిణీ సాగింది. ఈ ఐదేళ్ల కాలంలో డీకేటీ భూముల పంపిణీ చూస్తే రెవెన్యూ అధికారులే కళ్లు తేలేయాల్సిందే. వైసీపీ అనే ముద్ర వేసుకున్న ప్రతి ఒక్కరికి.. వైసీపీ నాయకులు మనవాడే అని చెప్పిన వారందరికీ డీకేటీ భూములను అప్పనంగా ఇచ్చేశారు. ఈ వ్యవహారంలో నిబంధనలు ఏమాత్రం పట్టించుకోలేదు. చివరకు అసైన్‌మెంట్ కమిటీ రికార్డుల్లో దిద్దుబాట్లు, దొంగరాతలతో భూములు దక్కించుకున్న ఘనులు కూడా ఉన్నారు. నాయకులకు, ప్రజలకు తెలియని లొసుగులను సైతం సాక్షాత్తు రెవెన్యూ అధికారులే చెప్పి వాటిని అమలు చేసిన దుస్థితి పులివెందులలో సాగింది. దీనిని గుర్తించిన కూటమి ప్రభుత్వం పలు మండలాల్లో భూ పంపిణీపై విచారణ చేపట్టింది. తొండూరు మండలంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బంధువు దాదాపు 100 ఎకరాలను బినామీ పేర్లతో, తన కుటుంబభ్యుల పేర్లతో ఎక్కించుకున్నారని పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వైసీపీకి చెందిన మరో నాయకుడు లింగాల మండలంలో ఎరాలకు ఎకరాలు ప్రభుత్వ భూములను పొందినట్లు తెలిసింది.

ప్రభుత్వ భూమి కనుమరుగు

పులివెందుల నియోజక వర్గంలోని ఏడు మండలాల్లో ప్రభుత్వ భూమి దాదాపు కనుమరుగైనట్లేనని పేరు చెప్పడానికి ఇష్టపడని ఓ అధికారి పేర్కొన్నారు. పులివెందుల మండలమే కాకుండా తొండూరు, సింహాద్రిపురం, లింగాల, వేముల, వేంపల్లె, చక్రాయపేట మండలాల్లో కూడా పెద్దఎత్తున భూదందాలు సాగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే సింహాద్రిపురం, లింగాల, వేముల మండలాల్లో సాగిన భూ పంపిణీపైన విచారణ చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ మండలాల్లో భూ ఆక్రమణలు సాగాయని కూటమి ప్రభుత్వం గుర్తించింది. ఈ మండలాలే కాకుండా తొండూరు, పులివెందులలో కూడా పెద్దఎత్తున డీకేటీ భూముల వ్యవహారం సాగినట్లు తెలిసింది.

కంచే చేను మేసింది



పులివెందుల తహసీల్దార్ కార్యాలయం

ప్రభుత్వ భూమిని కాపాడాల్సిన రెవెన్యూ అధికారులే వాటిని మింగేశారనే ఆరోపణలు తీవ్రంగా ఉన్నాయి. బినామీలతో చేతులు కలిపి లక్షల రూపాయలు ముడుపుల రూపంలో తీసుకుని డీకేటీ భూములను ధారాదత్తం చేశారు. ఇదే అదనుగా భావించి మంచి విలువ ఉన్న ప్రాంతాల్లో రెవెన్యూ అధికారులు కూడా భూములను బినామీల పేర్లతో కాజేసినట్లు విమర్శలు లేకపోలేదు. గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికలకు ఆరు నెలల ముందు పులివెందులలో సర్వేయర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు కలిసి పెద్ద భూభాగోతమే నడిపారు. పులివెందుల చుట్టుపక్కల ఉన్న దాదాపు రూ.50కోట్ల భూమిని కొట్టేసేందుకు పక్కా ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. అప్పట్లో ఏకంగా కలెక్టర్ సంతకాన్నే ఫోర్జరీ చేశారు. ఈ భాగోతం బయటపడడంతో కంప్యూటర్ ఆపరేటర్లు, సర్వేయర్లు కూడా సస్పెన్షన్‌కు గురయ్యారు.

అధికారి ఏమన్నారంటే..

డీకేటీ భూములను ఎంతమందికి ఎన్ని ఎకరాలు ఇచ్చారనే వివరాలకోసం శుక్రవారం ఆర్డీఓ చిన్నయ్యను ఆంధ్రజ్యోతి కలిసింది. అప్పటికే పలు దఫాలు ఆర్డీఓను కలిసి 2019-2024 వరకు నియోజకవర్గ వ్యాప్తంగా ఏ మండలంలో ఎన్ని ఎకరాల డీకేటీ భూములు పంపిణీ చేశారో వాటి వివరాలు ఇవ్వాలని కోరింది. ఆ వివరాలు తహశీల్దార్ వద్ద ఉంటాయని, తెప్పించి ఇస్తానని మొదట తెలిపారు. శుక్రవారం మరోమారు కలిసినపుడు ఆ వివరాలు ప్రభుత్వానికి సంబంధించినవని మీడియాకు ఎందుకు ఇవ్వాలని ప్రశ్నించారు. వివరాలు కావాలంటే కడపలో అడిగి తీసుకోండి అంటూ ఉచిత సలహా ఇచ్చారు. దీనిని బట్టి ప్రభుత్వ భూములను అడ్డగోలుగా పంపిణీ చేశారని స్పష్టంగా తెలుస్తోంది. నియోజకవర్గ వ్యాప్తంగా అధికారులు విచారణ చేస్తే వైసీపీ హయాంలో సాగిన భూభాగోతం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

సచివాలయ ఉద్యోగులకు బదిలీలు

కడప రూరల్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సచివాలయాలలో పనిచేస్తున్న ఆయా శాఖలకు సంబంధించి 945 మంది ఉద్యోగులకు శనివారం నుంచి బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. ఇందులో జిల్లాలోని సచివాలయాలలో పనిచేస్తున్న గ్రేడ్-5 సెక్రటరీలు 5 సంవత్సరాలు సర్వీస్ పూర్తి చేసినవారు 138 మందితో పాటు రిక్వెస్ట్ బదిలీలకు 74 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరికి జేసీ ఆధ్వర్యంలో శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. అలాగే గ్రేడ్-6 సెక్రటరీలు ఒకే చోట 5 సంవత్సరాలు పూర్తిచేసిన వారు 280 మందితో పాటు రిక్వెస్ట్ బదిలీలకు 67 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరికి కూడా జేసీ ఆధ్వర్యంలోనే డీపీఆర్‌సీలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి కౌన్సెలింగ్‌ను నిర్వహించనున్నారు. కాగా.. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖలోని సచివాలయాలలో పనిచేస్తున్న అసిస్టెంట్ ఏఈలకు శనివారం కడప నగరంలోని పీఆర్ ఎస్ఈ కార్యాలయంలో బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ఎస్ఈ జీవీ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఒకే చోట 5 సంవత్సరాలు పూర్తిచేసిన వారు 386 మంది బదిలీల జాబితాలోకి వస్తున్నారన్నారు.

చెరువులో అక్రమ కట్టడం

● కూల్చేసిన అధికారులు



అధికారులు కూల్చివేసిన వైసీపీ నాయకుని గెస్ట్‌హౌస్

బద్వేలు రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి లోని బయన పల్లె గ్రామ సమీపంలో చెరువ లో వైసీపీ వలంటరీ విభాగం జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి అక్రమంగా నిర్మించుకున్న గెస్ట్‌హౌస్‌ను శుక్రవారం తెల్లవారుజామున ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. గురువారం సాయంత్రం నుంచి అధికారులు అక్రమకట్టడాన్ని తొలగించాలని చూసినప్పటికీ శ్రీకాంత్‌రెడ్డి వర్గీయుల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురుకావడంతో రాత్రి 10గంటల సమయంలో వెనుదిరిగారు. ఎలాగైనా అక్రమ కట్టడాలను తొలగించి బద్వేలు ప్రాంతంలో భూ ఆక్రమణలను కట్టడి చేయాలన్న ఉద్దేశ్యంతో తిరిగి తెల్లవారుజామున బయనపల్లెకు చేరుకుని ఆ గెస్ట్‌హౌస్‌ను కూల్చివేశారు. కాగా.. కూల్చివేసిన కట్టడాన్ని శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే డాక్టర్ సుధ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో రెడ్‌బుక్ రాజ్యాంగం బద్వేలు నియోజకవర్గానికి కూడా విస్తరించిందని అన్నారు. శ్రీకాంత్‌రెడ్డి నిర్మించుకున్న భవనం చెరువులో ఉందంటున్నారని.. ఇలాంటి నిర్మాణాలు వేరేవారివి కూడా ఉన్నా దీనిని మాత్రమే కూల్చడం ఎందుకని ప్రశ్నించారు. ఇప్పటికైనా కక్ష పూరిత రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు.

పది రోజుల శిశువు అదృశ్యం



కనిపించకుండా పోయిన శిశువు, కుమారి

పులివెందుల, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పట్టణంలోని లక్ష్మీహాల్ సమీపంలో నివాసం ఉంటున్న దూదేకుల రాజకుళాయమ్మ తమ పదిరోజుల శిశువు కనిపించలేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలో పులివెందులలోని ఓ సొసైటీలో రాజకుళాయమ్మ, కుమారి పనిచేసేవారు. ప్రస్తుతం రాజకుళాయమ్మ కడప రిమ్స్‌లో పనిచేస్తున్నారు. ఈమె ఈనెల 18వ తేదీన మగ శిశువుకు జన్మనిచ్చింది. ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయి పులివెందులకు వచ్చింది. కుమారి కూడా పులివెందులకు వచ్చి రాజకుళాయమ్మకు తోడుగా ఉండేది. ఈ నేపథ్యంలో శుక్రవారం పగలు రాజకుళాయమ్మ నిద్రపోయి మధ్యాహ్నం 2 గంటలకు లేచిచూడగా కుమారి, శిశువు కనిపించలేదు. సొంత గ్రామమైన నల్లపురెడ్డిపల్లెలో విచారించగా కుమారి ఆచూకీ తెలియకపోవడంతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు పులివెందుల డీఎస్పీ 9121100545, సీఐ 9121100544 నెంబర్లకు తెలియజేయాలని కోరారు.

జ్యోతి క్షేత్రానికి ఆర్టీసీ బస్సులు

● సమస్యను పరిష్కరించిన మంత్రి నారాలోకేశ్

కాశినాయన / కడప కలెక్టరేట్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అవధూత కాశిరెడ్డినాయన జ్యోతిక్షేత్రానికి శుక్రవారం మధ్యాహ్నం నుంచే బస్సు సర్వీసులను ఆర్టీసీ అధికారులు ఆగమేఘాలపై పునరుద్ధరించారు. బస్సులను అనుమతించేది లేదని స్థానిక అటవీశాఖ అధికారులు గురువారం అభ్యంతరం తెలిపారు. దీంతో ఆర్టీసీ అధికారులు జ్యోతిక్షేత్రానికి శుక్రవారం నుంచి బస్సు సర్వీసులు నిలిపి వేస్తున్నట్లు ప్రకటించారు. ఈ విషయంపై ఆంధ్రజ్యోతిలో కథనం రావడంతో స్పందించిన మంత్రి నారా లోకేశ్ సంబంధిత శాఖల మంత్రులు, అధికారులతో మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు. వెంటనే కాశినాయన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా బస్సులను పునరుద్ధరించాలని ఆదేశాలు జారీచేశారు. భక్తుల మనోభావాలు, ప్రయాణ సౌకర్యాల విషయంలో ప్రజాప్రభుత్వం పూర్తి నిబద్ధతతో పనిచేస్తుందని మంత్రి అన్నారు. కాగా.. కాశినాయన జ్యోతి క్షేత్రానికి ఆర్టీసీ బస్సులు యథావిధిగా నడుస్తున్నాయని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా అటవీ శాఖ అదికారులతో చర్చించామని, ఆర్టీసీ బస్సులు తిరిగి ప్రారంభించేందుకు రవాణ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశామని పేర్కొన్నారు. మంత్రి లోకేశ్ స్పందించి ఆర్టీసీ సర్వీసులను పునరుద్ధరించడంపై భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గండికోట ప్రాజెక్టు పరిశీలన



గండికోట ప్రాజెక్టును పరిశీలిస్తున్న చీఫ్ ఇంజనీర్ శ్రీరామచంద్రమూర్తి తదితరులు

కొండాపురం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టును జిల్లా నీటిపారుదలశాఖ చీఫ్ ఇంజనీర్ శ్రీరామచంద్రమూర్తి శుక్రవారం పరిశీలించారు. అదేవిధంగా గండికోట ప్రాజెక్టు సొరంగాన్ని, సొరంగం వద్ద నుంచి ప్రాజెక్టులోకి వచ్చే కాలువను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి ప్రాజెక్టు నిర్వహహణపై పలు జాగ్రత్తలు, సూచనలు తెలియజేశారు. ప్రస్తుతం ప్రాజెక్టులోని నీటిమట్టం వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ కొండారెడ్డి, ఈఈ ఉమామహేశ్వర్లు, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.



ప్రైవేటు విద్యాసంస్థల్లో..

ఉచిత విద్య మిథ్య

● 25 శాతం సీట్ల ఉచిత అడ్మిషన్లపై అభ్యంతరాలు ఎన్నో

కడప ఎడ్యుకేషన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పేద, బడుగు, బలహీన వర్గాల కుటుంబాల్లోని పిల్లలకు అన్ని ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యాహక్కు చట్టం కింద 25శాతం సీట్లకు ఉచిత అడ్మిషన్లు ఇవ్వాలన్న నిబంధనలు సక్రమంగా అమలుకావడం లేదు. ఉచిత అడ్మిషన్లకు పలు ప్రైవేట్ విద్యాసంస్థలు నిరాకరిస్తుండగా .. తమకు నచ్చిన ప్రైవేట్ స్కూల్‌ను ఈ పథకంలో ఎంచుకునే అవకాశం లేకపోవడంతో పిల్లలను చేర్పడానికి తల్లిదండ్రులు విముఖత చూపిస్తున్నారు.

విద్యాహక్కు చట్టంలోని 131(సి) నిబంధనల మేరకు అన్ని ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఒకటో తరగతికి ప్రభుత్వం కేటాయించిన సీట్ల సంఖ్యలో 25శాతం సీట్లను ఎస్సీ, ఎస్టీ, అనాథలు, హెచ్ఐవీ ఎఫెక్టెడ్, దివ్యాంగులు, బీసీలు, మైనార్టీలు, ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న వెనుకబడిన వర్గాలు, పరిమిత వార్షికాదాయం ఉన్న ఓసీలు, తదితర కుటుంబాల పిల్లలకు ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాలు కల్పించాలి. ఇలా ఒకటో తరగతిలో అడ్మిషన్ పొందిన బాలబాలికలు 8వ తరగతి పూర్తిచేసే వరకు అదే ప్రైవేట్ విద్యాసంస్థలో కొనసాగవచ్చు. ఒకవేళ తల్లిదండ్రులకు ఇష్టంలేకపోతే పిల్లలను వేరే స్కూల్‌కు మార్చుకోవచ్చు. అయితే స్కూల్ మారినా లేదా నేరుగా రెండో తరగతి, ఆపై తరగతుల్లోకి చేరినా ఉచిత అడ్మిషన్ నిబంధన వర్తించదు.

మిగిలిన సీట్లు

జిల్లాలో 2025-26 విద్యా సంవత్సరానికి 494 పాఠశాలల్లో చేరేందుకు అవకాశం ఇచ్చారు. మొదటి ఫేజ్‌లో 720 సీట్లు కేటాయించినా 409 మంది మాత్రమే అర్హత సాధించారు. వీరిలో 322 మంది చేరగా 87సీట్లు మిగిలిపోయాయి. రెండో ఫేజ్‌కు ఈ నెల 28 వరకు ప్రవేశాలకు అవకాశముంది. ఈ ఫేజ్‌లో 311 సీట్లు కేటాయించారు. మొదటి ఫేజ్‌లో మిగిలిన 87 సీట్లుకూడా దీనికి కలపాలి. అంటే మొత్తం 398 సీట్లను ఉచితంగా ఇవ్వాలి. మొదటి ఫేజ్‌లోనే సీట్లు మిగిలాయంటే.. రెండవ ఫేజ్ సీట్ల భర్తీ పూర్తిస్థాయిలో మిగిలిపోయే అవకాశం ఉంది. 2019 ముందు విద్యాహక్కు చట్టం ద్వారా విద్యార్థులకు ఉచితంగా విద్య అందించిన ప్రైవేట్ సంస్థకు ప్రభుత్వం ఒక్కో విద్యార్థికి రూ.8వేలు చొప్పున అందించేది. ఆ విధానాన్ని గత వైసీపీ ప్రభుత్వం నిలిపివేయడంతో విద్యార్థులను చేర్చడానికి తల్లిదండ్రులు ఇష్టపడటం లేదు. ఇక తల్లికి వందనం ఆర్థిక సాయం ఇంట్లో చదువుకునే పిల్లలందరికీ అందడంతో తమకు అనుకూలమైన, అందుబాటులో ఉన్న ప్రైవేట్ పాఠశాలలో చేర్పించడానికి తల్లిదండ్రులు మక్కువ చూపుతున్నారన్న వాదన లేకపోలేదు.

అడ్మిషన్ల వెనుకబాటుకు అడ్డంకులివే

● ఉచిత అడ్మిషన్లు ఇచ్చిన ప్రైవేటు పాఠశాలలకు మూడేళ్లుగా ప్రభుత్వం రీయింబర్స్ చేయకపోవడంతో పలు ప్రైవేటు విద్యాసంస్థలు నిరాసక్తత వ్యక్తం చేస్తున్నాయి. ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యాలకు నేరుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ చేస్తున్నట్లుగానే.. ప్రభుత్వం ప్రాథమిక తరగతుల్లో ఉచిత సీట్లకు అడ్మిషన్లు పొందిన పిల్లల ఫీజులను చెల్లించాలని యాజమాన్యాలు కోరుతున్నాయి.

● మార్గదర్శకాల ప్రకారం ఒకటో తరగతిలోకి అడ్మిషన్ కోసం దరఖాస్తు చేసుకునే విద్యార్థి కుటుంబ పెద్ద (తల్లిదండ్రులు) నివసించే సచివాలయానికి ట్యాగ్ అయి ఉండాలి. సచివాలయ పరిధిలో 1-3 కిలోమీటర్ల దూరంలోని ప్రైవేట్ ప్రాథమిక పాఠశాలలకు మాత్రమే ఐచ్చికాలను ఇవ్వాలి. అంతకుమించి దూరంలో తల్లిదండ్రులు ఆసక్తి కనబరిచే ప్రైవేటు పాఠశాలలు ఉన్నప్పటికి వాటిలో పిల్లలను చేర్పేందుకు ఆప్షన్ ఇవ్వడానికి సాంకేతికంగా అవకాశం లేదు. ఈ కారణంగానే సీట్ల తుది కేటాయింపు జరిగే సరికి పలువురు సంబంధిత ప్రైవేట్ స్కూలులో పిల్లలను చేర్పించడానికి అయిష్టత చూపుతున్నారు.

● ఉచిత అడ్మిషన్ అనేది కేవలం ఫీజు చెల్లింపు నుంచి ఊరట మినహా, మిగతా వస్తువులైన పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు, యూనిఫాం దుస్తులు, బూట్లు, టై, తదితర విద్యాసామాగ్రినంతా డబ్బులు వెచ్చించి కొనుగోలు చేసుకోవాల్సిందే. ఈ షరతుల వల్ల కూడా అంతగా మొగ్గుచూపడం లేదని అంటున్నారు. ప్రభుత్వం ఈ మార్గదర్శకాలలో మార్పులు చేస్తే తప్ప ప్రైవేటులో 25 శాతం మందికి ఉచిత విద్య అనేది 100 శాతం అమలు కాదు.



ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత సీట్లు భర్తీ కాకపోవడంపై డీఈవో షంషుద్దీన్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. రాష్ట్ర ప్రభుత్వం తల్లికి వందనం నిధులు విడుదల చేసిందని అన్నారు. ఇంట్లో ఉన్న పిల్లలందరికీ ఈ డబ్బులు రావడంతో వీటికి మరికొంత కలిపి పిల్లలను తమకు నచ్చిన పాఠశాలల్లో చేర్చారని, దీంతో ఉచిత సీట్లు భర్తీ కాలేదని అన్నారు.

కమిషనర్, డీఎస్పీలపై
మానవహక్కుల కమిషన్‌కు ఫిర్యాదు

● పులివెందుల మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం

పులివెందుల, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పులివెందుల కమిషనర్ రాముడు, డీఎస్పీ మురళీనాయక్‌పై మానవహక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేయాలని పులివెందుల కౌన్సిల్ తీర్మానం చేసింది. శుక్రవారం మున్సిపల్ కార్యాలయ సభాభవనంలో చైర్మన్ వరప్రసాద్ అధ్యక్షతన అత్యవసర కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారి అజెండా చదివి వినిపించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ గత నెల 26వ తేదీన పులివెందుల రింగురోడ్డు కూడలిలో వైఎస్సార్ విగ్రహం వద్ద టీడీపీ తోరణాలు కట్టారని, వాటిని తొలగించాలని మున్సిపల్ కమిషనర్ రాముడుకు, సీఐ చాంద్‌బాషాకు ఫిర్యాదు చేశామన్నారు. అయినా పోలీసులు, మున్సిపల్ కమిషనర్ స్పందించలేదన్నారు. కమిషనర్‌కు, టీపీవో అజయ్‌కుమార్‌కు ఫోన్ చేసినా పట్టించుకోలేదన్నారు. చివరకు 28వ తేదీ వైఎస్ విగ్రహాల వద్ద ఉన్న తోరణాలను మాత్రమే తొలగించామన్నారు. ఈ విషయాన్ని ఓ కానిస్టేబుల్ మొబైల్ ఫోన్‌లో వీడియోలు తీశారన్నారు. కానీ 28వ తేదీ రాత్రి తనతోపాటు మున్సిపల్ వైస్‌చైర్మన్ హఫీజ్, కౌన్సిలర్ మరో 15 మందిపై కేసు నమోదు చేశారన్నారు. 13 మందిని అరెస్టు చేసి వేముల పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారన్నారు. వేముల పోలీస్‌స్టేషన్‌లో చితకబాదారన్నారు. కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి కలగజేసుకోవడంతో 29వ తేదీ రాత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అక్కడ నుంచి జమ్మలమడుగు కోర్టులో హాజరుపరిచారన్నారు. 22 రోజుల పాటు తమను జైలులో అక్రమంగా నిర్బంధించారన్నారు. దీనికి కమిషనర్, టీపీఓ బాధ్యత వహించాలని, సమాధానం చెప్పాలని చైర్మన్ పట్టుబట్టారు. దీనికి కమిషనర్ స్పందిస్తూ మహానాడు డ్యూటీలో ఉండడంతో అక్కడ మొబైల్స్ సరిగా పనిచేయకపోవడంతో ఈ పరిస్థితి జరిగిందని, దీనికి క్షమాపణ కోరుతున్నా అన్నారు. టీపీఓ కూడా ఇదే విషయాన్ని వెల్లడించారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ రాముడు, డీఎస్పీ మురళీనాయక్‌పైన మానవహక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేయాలని కౌన్సిల్ సమావేశం తీర్మానించిందని చైర్మన్ ప్రకటించారు. అనంతరం పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ ఆయా వార్డుల్లో తాగునీరు, డ్రైనేజీ, వీధిలైట్ల సమస్యను వివరించారు. వైస్‌చైర్మన్ వైఎస్ మనోహర్‌రెడ్డి, కౌన్సిలర్లు, తహశీల్దార్ నజీర్ అహ్మద్, అధికారులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఒకరి మృతి

● మరొకరికి తీవ్ర గాయాలు


కారు ఢీకొన్న సంఘటనలో మృతి చెందిన వ్యక్తి

ఓబులవారిపల్లె, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కడప-చెన్నై జాతీయ రహదారిలో జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఆ వివరాల్లోకి వెళితే.. మండలంలోని ముక్కావారిపల్లె గ్రామ పంచాయతీలో అమృతవారిపల్లె వద్ద దళితవాడకు చెందిన గుండ్ల నారాయణ(40) హైవేరోడ్డుపై నడిచి వస్తుండగా ఎదురుగా వస్తున్న ఏపీ 40 బీహెచ్ 2497 నంబరు గల కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడని ఎస్ఐ మహేష్ తెలిపారు. విషయం తెలుసుకున్న వెంటనే ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కారు ఢీకొనడంతో...

మంగంపేట గ్రామ పంచాయతీ పరిధిలో మంగంపేట దళితవాడకు చెందిన ఒంటిమిట్ట ఈశ్వరయ్య టిఫిన్ కోసం వస్తుండగా మలుపు తిరిగే క్రమంలో ఎదురుగా వస్తున్న ఏపీ 21ఎస్ 7678 నంబరు గల మారుతి సుజికి కారు ఢీకొనడంతో ఆ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం రైల్వేకోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆర్టీసీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. భార్య పిల్లలు ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ద్విచక్రవాహనాలు ఢీకొని ఒకరికి..

రామసముద్రం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎలవానెల్లూరు గ్రామ పంచాయతీ దాసార్లపల్లె సమీపంలో శుక్రవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. దాసార్లపల్లె సమీపంలోని ఘాట్ వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బోయవీధికి చెందిన అశోక్‌ఆచారికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం రామసముద్రం ప్రభుత్వాస్పత్రి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం అశోక్‌ను మెరుగైన వైద్యం కోసం మదనపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పొలంలో కొండచిలువ

● చాకచక్యంగా పట్టుకున్న అటవీ అధికారులు


కొండచిలువను గోనె సంచిలో వేస్తున్న అటవీ రేంజి డీఆర్వో

ముద్దనూరు జూన్ 27 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు రోడ్డులోని ఓ రైతు పొలంలో ఉన్న దాదాపు 8 అడుగుల కొండ చిలువను శుక్రవారం అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. గురువారం సాయంత్రం కొండ చిలువ పొలంలో ఉన్న కోడిని చుట్టేసి చంపడం చూసి పొలం వద్ద ఉన్న వారు బిత్తరపోయి ఇంటికి వెళ్లిపోయారు. శుక్రవారం ఉదయం వచ్చి చూడగా కొండ చిలువ కోడిని చంపి తిని పడుకొని ఉంది. ఈ సమాచారం అటవీ అధికారులకు తెలియజేయడంతో అటవీ రేంజి డీఆర్వో శ్రీనివాసులు తన సిబ్బందితో వచ్చి కొండ చిలువ ఎక్కడికి పోకుండా ఎక్స్‌కవేటర్‌తో చుట్టూ మట్టివేశారు. కొండ చిలువ నోటిని చేత్తో గట్టిగా పట్టుకొని తోక వైపు నుంచి గోనె సంచిలో వేసి, అటవీ ప్రాంతంలో సురక్షితంగా వదిలారు. దీంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

వెలుగులోకి 18వ శతాబ్దం నాటి విగ్రహం



బ్రహ్మంగారిమఠం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేకలకుంట్ల గ్రామం ఎస్సీ కాలనీకి సమీపంలో 18వ శతాబ్దం నాటి విగ్రహం బయల్పడిందని రచయిత, చరిత్రకారుడు బొమ్మిశెట్టి రమేశ్ తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వైస్ ఎంపీపీ కూనపులి రాజశేఖర్ నాయుడు ఉదయం తన పొలాన్ని దుక్కి దున్నుతుండగా ఈ విగ్రహం బయల్పడిందన్నారు. ఈ ప్రాంత అలనాటి చరిత్రను తెలిపేందుకు ఈ విగ్రహం సాక్ష్యాధారమని అన్నారు. ఇది ఒక మహిళా విగ్రహమని... ఎడమ వైపు కొప్పు ధరించి.. మెడలో పెండెంట్ (పతకం) ఉందని చెప్పారు. ఎడమ వైపు చేతిలో ఒక చంటి పిల్లోడు, కుడివైపు చేతిలో ఒక పుష్పం చేతబట్టినట్లు ఆనాటి శిల్పకారులు అద్భుతంగా చెక్కారని ఆయన వెల్లడించారు. ఈ విగ్రహం గురించిన సమాచారాన్ని కడప యోగివేమన విశ్వవిద్యాలయం లలిత కళల విభాగపు సహాచార్యులు కోట మృత్యుంజయరావుకు తెలుపగా ఆయన ఇది 18వ శతాబ్దం నాటి విగ్రహమని స్పష్టం చేసినట్లు రమేశ్ వివరించారు.

టెక్నాలజీపై శిక్షణకు అవగాహన ఒప్పందం


టెక్నాలజీపై ఒప్పందం చేయించుకుంటున్న కేఎస్ఆర్ఎం ప్రిన్సిపాల్ వీఎస్ఎస్ మూర్తి, కంపెనీ ప్రతినిధులు

సీకేదిన్నె, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఇన్నోమాటిక్స్ రీసెర్చ్ ల్యాబ్ హైదరాబాదు వేగంగా అభివృద్ధి చెందుతున్న హెడ్జెట్ సంస్థ భవిష్యత్తు టెక్నాలజీపై కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలతో కీలక అవగాహన ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులకు డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, మిషన్ లర్నింగ్, ఫుల్‌స్టాక్ డెవలప్‌మెంట్, పైతాన్, జనరేటివ్ ఏఐ, అమెజాన్ వెబ్‌సర్వీసెస్, డిజిటల్ మార్కెటింగ్ వంటి అధునాతన అవసరమైన సాంకేతిక శిక్షణను అందించడమే లక్ష్యమని ప్రిన్సిపాల్ వీఎస్ఎస్ మూర్తి తెలిపారు. ఈ శిక్షణ విద్యార్థుల ఉన్నత భవిష్యత్తుకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో కందుల విద్యాసంస్థల అధినేత డాక్టర్ కందుల చంద్ర ఓబుళరెడ్డి, వైస్‌ప్రిన్సిపాల్ టీఎన్‌ప్రసాద్, ప్రొఫెసర్ గిరిధర్, కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కడప-రేణిగుంట హైవే రోడ్డు క్లియరెన్స్‌పై చర్చలు

● డీఎఫ్‌వోను కలిసిన అన్నమయ్య బీజేపీ జిల్లా అధ్యక్షుడు


డీఎఫ్‌వో జగన్నాథ్‌సింగ్‌తో చర్చిస్తున్న సాయిలోకేశ్

రాజంపేట, జూన్ 27(ఆంధ్రజ్యోతి): కడప-రేణిగుంట జాతీయ రహదారికి అటవీశాఖ అనుమతుల విషయంపై బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్ చర్చలు జరిపారు. శుక్రవారం డీఎఫ్‌వో కార్యాలయానికి వెళ్లి డీఎఫ్‌వో జగన్నాథ్‌సింగ్‌ను కలిసి ఈ విషయంపై చర్చించారు. హైవేరోడ్డుకు రెండేళ్ల కిందట కేంద్ర ప్రభుత్వం సుమారు రూ.3500 కోట్ల నిధులు మంజూరు చేసిందని, అటవీశాఖ అనుమతులు రాక పనులు ప్రారంభించ లేదని, ఈ రహదారి పనులు పూర్తి కాకపోవడంతో డబుల్‌లైను రోడ్డులో వాహనాల రద్దీ ఎక్కువై ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. ఈ రోడ్డు క్లియరెన్స్ విషయాన్ని బుధవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. స్పందించిన ఉప ముఖ్యమంత్రి ఫోన్‌లో అటవీశాఖ అధికారులతో చర్చించారని, కాబట్టి వెంటనే ఫారెస్ట్ క్లియరెన్స్ విషయంపై ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేయాలని, అలాగే జిల్లాలో పర్యాటక ప్రాంతమైన హార్సిలీహిల్స్ ప్రాంతంలో ఆకతాయిలు గుట్కా ఇతర మత్తుపదార్థాలు తీసుకెళతున్నారని, వీటిపై చర్యలు తీసుకోవాలని డీఎఫ్‌వోను కోరారు. ఫారెస్టు క్లియరెన్స్ విషయంపై ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులతో చర్చిస్తున్నామని, త్వరలో అనుమతులు లభిస్తాయని డీఎఫ్‌వో తెలిపారు.

వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయండి


మాట్లాడుతున్న అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ రవిబాబు

పులివెందుల రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకు ప్రబలుతున్న వ్యాధులపై ప్రజలకు సరైన అవగాహన కల్పిస్తూ.. వ్యాధుల నియంత్రణకు అంకితభావంతో పనిచేయాలని అడిషనల్ డీఎం అండ్‌హెచ్‌వో డాక్టర్ రవిబాబు సూచించారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి టీబీ, లెప్రసీ, హెచ్‌ఐవీ, సురక్ష కేంద్రాల రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆసుపత్రి సూపరిండెంటెంట్ డాక్టర్ శ్రీనివాస్‌తో జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా టీబీ ముక్త్ భారత్ అభియాన్ ఇంటెన్సిఫైడ్ టీబీ క్యాంపెయిన్ గురించి చర్చించారు. అనంతరం బాకరాపురంలోని యూపీహెచ్‌సీని సందర్శించి ఆరోగ్య, ఆశా కార్యకర్తలకు సమావేశం నిర్వహించారు.

ఈసందర్భంగా డాక్టర్ రవిబాబు మాట్లాడు తూ హెచ్‌ఐవీ, క్షయ, కుష్టు వ్యాధుల పట్ల ప్రజలను మరింత అప్రమత్తం చేయాలన్నారు. తాత్కాలిక సుఖాలకు పాల్పడి హెచ్‌ఐవీ బారిన పడుతున్న విషయాన్ని తెలియజేయాలన్నారు. అలాగే క్షయ అనేది గాలి ద్వారా వ్యాపిస్తుందని, రోగనిరోధక శక్తి తక్కువ ఉన్న వారికి వెంటనే సోకుతుందనే విషయాన్ని తెలియజేయాలన్నారు. అలాగే క్షయబారిన పడిన వారు మాస్క్ ధరించాలని, పౌష్టికాహారం తీసుకోవాలనే విషయాన్ని తెలియ జేయాలన్నారు. అలాగే స్పర్శలేని పొడలు, వేళ్ల మొద్దుబారిపోవడం లాంటివి కుష్టు వ్యాధి లక్షణాలని వాటిని గుర్తిస్తే వెంటనే స్థానిక ఆసుపత్రిని సందర్శించాలని ప్రజలకు తెలపాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శాంతికుమార్, డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ సుబ్బారెడ్డి, ఏపీహెచ్ఈఓ, టీబీ, హెచ్‌ఐవీ సిబ్బంది పాల్గొన్నారు.

రామ్‌దేవ్ బాబాకు స్థలం కేటాయింపును తక్షణమే రద్దు చేయాలి

● ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ

రాయచోటిటౌన్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర ఊటీగా రాష్ట్రంలో గుర్తింపు పొందిన పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌లో రామ్‌దేవ్ బాబాకు స్థలం కేటాయింపును తక్షణమే రద్దు చేయాలని, ప్రకృతి సంపదలను కార్పొరేట్ సంస్థల చేతిలో పెడితే చూస్తూ ఊరుకోమని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా వివాదాస్పదంగా నిలిచిన రామ్‌దేవ్ బాబా సంస్థలకు భూమి కేటాయింపు నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. హార్సిలీ హిల్స్‌ను స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాలతో సంప్రదించి ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని కోరారు. హార్సిలీహిల్స్‌లో గతంలో వైసీపీ ప్రభుత్వం యాత్ర సినిమా డైరెక్టర్‌కు భూకేటాయింపు చేస్తే వ్యతిరేకించిన ఆనాటి కూటమి నాయకులు నేడు పతంజలి కార్పొరేట్ సంస్థకు అప్పగించడాన్ని ఎలా సమర్థిస్తారని ప్రశ్నించారు.

కీచక ఉపాధ్యాయుడు సస్పెన్షన్

జమ్మలమడుగు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పెద్దముడియంమండలం జంగాలపల్లె ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న హిందీ ఉపాధ్యాయుడు మస్తాన్‌ను సస్పెండ్ చేసినట్లు డీఈవో షంషుద్దీన్ తెలిపారు. విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని ఫిర్యాదు మేరకు శుక్రవారం ఎంఈవో చంద్రశేఖర్‌రావు గ్రామంలో విచారించారన్నారు. అక్కడ విద్యార్థినుల తల్లిదండ్రులు, ఇతరులు తెలిపిన వివరాల మేరకు సస్పెండ్ చేసినట్లు తెలిపారు. ఎక్కడైనా జిల్లాలో ఇలాంటి ప్రవర్తన కలిగిన ఉపాధ్యాయులు ఉంటే ఫిర్యాదు చేస్తే వెంటనే వారిపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నా రు. కాగా, జంగాలపల్లిలో విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన హిందీ ఉపాధ్యాయుడిపై సంబంధిత అధికారులు పోక్సో కేసు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జమ్మలమడుగులోని కన్నెలూరు విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఎంఈవో చంద్రశేఖర్‌రావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ పట్టణ ఉపాధ్యక్షుడు సుబహాన్, తదితరులు పాల్గొన్నారు.

ఆరు నెలలుగా కోమాలోనే..

● రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ రైతు మృతి


మృతి చెందిన శ్రీనాథ్‌రెడ్డి (ఫైల్)

ములకలచెరువు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆరు నెలలు కోమాలోనే ఉన్న రైతు చివరకు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. శ్రీ సత్యసాయి జిల్లా తనకల్లు మండలం యర్రబల్లికి చెందిన శ్రీనాథరెడ్డి(45) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. ఇతనికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈక్రమంలో ఆరు నెలల క్రితం పని నిమిత్తం ద్విచక్రవాహనంలో ములకలచెరువుకు వచ్చాడు. తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా ములకలచెరువు మార్కెట్ యార్డు ఎదురుగా ఇతని ద్విచక్రవాహనాన్ని మరో ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయం కావడంతో కోమాలోకి వెళ్లాడు. అనంతపురం లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం చేయించారు. అయితే శ్రీనాథరెడ్డి కోమాలో నుంచి బయటకు రాకపోవడంతో డాక్టర్లు చేసేది లేక ఇటీవల ఇంటికి పంపించేశారు. పరిస్థితి విషమించి గురువారం రాత్రి శ్రీనాథరెడ్డి మృతి చెందాడు.

ఆయిల్ ఫామ్ సాగుకు అనుకూలం

వేముల, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పులివెందుల, లింగాల, వేముల మండలాలు ఆయిల్ ఫామ్ సాగుకు అనుకూలంగా ఉన్నాయని జిల్లా ఉద్యానశాఖ అధికారి రవిచంద్రబాబు తెలిపారు. శుక్రవారం ఆయిల్ ఫామ్ మెగాప్లాంటేషన్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా వేములలో ఉద్యా నశాఖ, ఎంకేఆగ్రోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ సాగు చేయనున్న రైతులకు ఉద్యానశాఖ ద్వారా మొక్కలు నాటుకునేదుకు రూ.27వేలు, నాలుగేళ్ల పాటు మొక్కల నిర్వహణకు సంవత్సరానికి హెక్టర్‌కు రూ.5250, అంతర్ పంటలు వేసుకునేందుకు సంవత్సరానికి హెక్టార్‌కు రూ.5250 సబ్సిడీ ఇస్తారన్నారు. అనంతరం వేములలో ఓ రైతు సాగుకు ఆసక్తి చూపడంతో ఆయిల్ ఫామ్ మొక్కలు నాటారు. కార్యక్రమలో మార్క్ ఫెడ్ డైరెక్టర్ శశిభూషణ్‌రెడ్డి, ఉద్యాన అధికారి రాఘవేంద్రరెడ్డి, బీజేపీ కిసాన్ మోర్చ సంఘ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ డ్రైనేజీ పనుల్లో అక్రమాలు

● ఒక ఈఈకి ఊరట.. మరో ఈఈకి రెండు ఇంక్రిమెంట్లు కోత

కలికిరి / పులివెందుల, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పట్టణంలో 2014 లో వేసిన సీసీ రోడ్ల పనుల్లో జరిగిన అక్రమాల్లో ఇద్దరు కడప పీహెచ్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లను బాధ్యులుగా నిర్ధారిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. ఈ పనుల్లో జరిగిన అక్రమాలకు సంబంధించి అభియోగాలపై ఉన్నత సాయి ఇంజినీర్లతో విచారణ జరిపించారు. ఇందులో నిర్ధారణ అయిన వాటికి సంబంధించి అప్పటి కడప పీహెచ్ ఈఈ ఆర్.నగేష్ బాబును బాధ్యుడిని చేసూ రెండు ఇంక్రిమెంట్లు కోత విధించింది. ఇవే పనుల్లో మరో ఈఈ టి.మోహన్‌పై ఏడు అభియోగాలు నమోదు కాగా అందులో నాలుగు అంశాల్లో ఆయనను బాధ్యుడిని చేసింది. అయితే తీవ్రమైన అనారోగ్యంతో తిరుపతిలో చికిత్స పొందుతున్న తాను విచారణకు హాజరు కాలేకపోయినట్లు మోహన్ ప్రభుత్వానికి విన్నవించారు. దీనిపైన మరో మారు విచారించి నివేదిక ఇవ్వాల్సిందిగా చీఫ్ ఇంజినీరును ప్రభుత్వం ఆదేశించింది. దరిమిలా తాజాగా మోహన్ తీవ్ర అనారోగ్యంతో చెన్నై ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నందున ఆయనపై చర్యలను ఉపసంహరించాలని చీఫ్ ఇంజినీరు ప్రభుత్వానికి సిఫారసు చేశారు. వీటన్నింటినీ పరిశీలించిన ప్రభుత్వం అభియోగాల నుంచి మోహన్‌కు పూర్తి విముక్తి కలిగించింది. ఈ మేరకు రెండు వేర్వేరు ఉత్తర్వులను మున్సిపల్ వ్యవహారాలు, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ శుక్రవారం జారీ చేశారు.

పటిష్టస్థితిలో కడప.. వెనుకంజలో నెల్లూరు జట్టు


ప్రణీల్‌రెడ్డి , సుదర్శన్, జయంత్‌కృష్ణ

కడప స్పోర్ట్స్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఏసీఏ అండర్-19 మెన్ మల్టీడే క్రికెట్ మ్యాచ్‌లలో పటిష్ట స్థితిలో కడప జట్టు ఉండగా, నెల్లూరు జట్టు వెనుకంజలో ఉంది. ఏసీఏ క్రికెట్ మైదానంలో కడప కర్నూలు జట్ల మధ్య సాగుతున్న మ్యాచ్‌లో శుక్రవారం ఓవర్‌నైట్ స్కోర్ 401 పరుగులతో తిరిగి బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 175.4 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 765 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. అంతకు ముందు కడప జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో మొదటి రోజు ఆటలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి 401 పరుగుల పటిష్ట స్థితిలో వున్న సంగతి తెలిసిందే. కాగా మొదటిరోజు ఆటలో 201 పరుగులతో నాటౌట్‌గా నిలిచిన ప్రణీల్‌రెడ్డి రెండవ రోజు బ్యాటింగ్‌కు దిగి 353 పరుగులు చేయడం విశేషం. అలాగే 114 పరుగులు చేయడంతో జట్టు భారీ స్కోర్ సాధించింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు ఆట ముగిసే సమయానికి 7 ఓవ ర్లలో 1 వికెట్ కోల్పోయి 14 పరుగులు చేసింది. దీంతో కర్నూలు జట్టు మరో 751 పరుగుల లోటుతో ఎదురీదుతుంది.

కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో నెల్లూరు-అనంతపురం జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో తొలుత నెల్లూరు జట్టు బ్యాటింగ్‌కు దిగి మొదటి ఇన్నింగ్స్‌లో 50 ఓవర్లలో 212 పరుగులకే ఆలౌట్ అయిన సంగతి తెలిసిందే. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన అనంతపురం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో ఆట ముగిసే సమయానికి 34 ఓవర్లలో 1 వికెట్ మాత్రమే కోల్పోయి 194 పరుగులు చేసింది. తిరిగి రెండవరోజైన శుక్రవారం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు మొత్తంగా 77 ఓవర్లలో 524 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో జయంత్‌కృష్ణ 221 పరుగులు, వీరారెడ్డి 157 పరుగులు చేశారు. దీంతో అనంతపురం జట్టుకు 312 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. రెండో ఇన్నింగ్స్‌కు దిగిన నెల్లూరు జట్టు రెండవరోజు ఆట ముగిసే సమయానికి 40 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 173 పరుగులు చేసింది. మరో 158 పరుగుల వెనుకంజలో ఎదురీదుతోంది.

బీటెక్ ఫైనల్ సెమిస్టర్ ఫలితాలు విడుదల


ఫలితాలను విడుదల చేస్తున్న వైస్ చాన్సెలర్ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు

కడప ఎడ్యుకేషన్,జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు వైఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాల బీటెక్ ఫైనల్ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను వైవీయూ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు విడుదల చేశారు. శుక్రవారం తన చాంబర్‌లో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ, ప్రొద్దుటూరు వైఎస్సార్ వైవీయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బి.జయరామిరెడ్డితో కలిసి ఫలితాలను వెల్లడించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ బీటెక్‌లోని ఆరు బ్రాంచ్‌లకు కలిపి 236 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 234 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. ఇద్దరు మాత్రమే ఫెయిల్ అయ్యారని తెలిపారు. 99.30 శాతం ఉత్తీర్ణత లభించిందని వివరించారు. సివిల్ ఇంజనీరింగ్ బ్రాంచ్, సీఎస్‌సీ బ్రాంచ్, ట్రిపుల్‌ఈ బ్రాంచ్, ఎంఈ బ్రాంచ్, ఎంఎంటి బ్రాంచ్‌లలో వందశాతం ఉత్తీర్ణత లభించిందన్నారు. ఈసీఈ విభాగంలో 95.70శాతం మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. పరీక్షల నిర్వహణతో పాటు త్వరితగతిన సమాధాన పత్రాల మూల్యాంకనం చేసి ఫలితాలు విడుదల ప్రక్రియ పూర్తి చేసిన పరీక్షల విభాగాన్ని వీసీ అభినందించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రశంసించారు.


అత్యున్నత లక్ష్యాలకు అద్భుత వేదిక కడప ఆర్ట్స్ కళాశాల


విద్యార్థికి నగదు బహుమతి అందజేస్తున్న ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్

కడప ఎడ్యుకేషన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): అత్యున్నత లక్ష్యాలను చేరుకోవడానికి విద్యార్థులకు అద్భుత వేదిక కడప ప్రభుత్వ పురుషుల కళాశాల (ఆర్ట్స్ కళాశాల) అని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్ అన్నారు. శుక్రవారం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ చాంబర్‌లో ఆంధ్రప్రదేశ్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఏపీ పీజీ సెట్ 2025) ఫలితాల్లో ఎం.కామ్ సబ్జెక్ట్‌లో రాష్ట్రవ్యాప్త మొదటి ర్యాంకును సాధించిన కళాశాల విద్యార్థి ఎం.చిన్నయ వెంకటసాయికి నగదు బహుమతి అందించి సత్కరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి ఆర్ట్స్ కళాశాలలో అన్ని వసతులు అందుబాటులో ఉన్నాయన్నారు. కంప్యూటర్ ల్యాబ్, ఎన్‌సీసీ, స్పోర్ట్స్, విశాలమైన ఆటస్థలం, అతిపెద్ద లైబ్రరీ, అత్యున్నత అర్హతలు గల అధ్యాపకులు ఉన్నారన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ నాగరాజు, డాక్టర్ కృష్ణవేణి, శివరాం, రెడ్డిబాష, రాధిక, విద్యార్థులు పాల్గొన్నారు.

కన్సల్టెంట్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

కడప, కలెక్టరేట్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఆకాంక్షిత జిల్లాల కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ప్రజల జీవనోపాధి అవకాశాలు మెరుగు పరిచేందుకు కలెక్టర్ ఆధ్వర్యంలో కన్సల్టెన్స్‌గా కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేసేందుకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి హజరత్తయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు కడప.ఏపీ.జీవోవి. ఇన్ వెబ్ సైట్‌లో సంప్రధించాలన్నారు.



మోడల్ పరీక్షను సద్వినియోగం చేసుకోవాలి

కడప రూరల్, జూన్ 27(ఆంధ్రజ్యోతి) : భారత న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో నేడు కడప బార్ అసోసియేషన్‌లో నిర్వహిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి మోడల్ పరీక్షను అభ్యర్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆ సంఘం ఉమ్మడి కడప జిల్లా అధ్యక్షుడు సి. సుబ్రహ్మణ్యం తెలిపారు. భారత న్యాయవాదుల సంఘం రాష్ట్ర వ్యాప్తంగా జూనియర్ సివిల్ జడ్జి మోడల్ పరీక్షలను నిర్వహిస్తోందన్నారు. మోడల్ పరీక్షను ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఉంటుందన్నారు.

పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్‌గా శివశంకర్

సింహాద్రిపురం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): సింహాద్రిపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ ఏ. శివశంకర్ శక్రవారం అధికారికంగా బాధ్యతలను చేపట్టారు. శివశంకర్ గతంలో ఇదే కళాశాలలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతిగా విధులు నిర్వహించేవారు. అధికారికంగా ప్రిన్సిపాల్ బాధ్యతలు చేపట్టిన ఆయన కళాశాల అభివృద్ధికి, విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాల పెంపుదలకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. కళాశాల సిబ్బంది ప్రిన్సిపాల్‌ను శాలువతో సత్కరించారు.

పారదర్శక సేవల కోసం ట్యాబ్‌లు

కడప ఎర్రముక్కపల్లె, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పారదర్శకత పాలన కోసం రాష్ట్ర ప్రభుత్వం డ్వాక్రామహిళలకు ట్యాబులు సరఫరా చేసినట్లు కడప ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం కడప నగరం ద్వారకానగర్ ఎమ్మెల్యే కార్యాలయలో పురపాలక శాఖ సరఫరాచేసిన ట్యాబులను డ్వాక్రా మహిళలకు ఆర్పీలకు అందించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, ప్రభుత్వ శాఖల్లో పారదర్శకతను పెంచుతూ, పరిపాలనలో వేగాన్ని తీసుకువచ్చి, ప్రజలకు ముఖ్యమైన పౌర సేవలు అన్నింటిని సత్వరంగా అందించేందుకు సాంకేతికతను ఉపయోగిస్తూ ముందుకు సాగుతోందన్నారు. డ్వాక్రా మహిళలకు నాణ్యమైన, పారదర్శక సేవలుఅందించడంలో ఈ ట్యాబ్‌లు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు.


ట్యాబులను అందజేస్తున్న ఎమ్మెల్యే మాధవి

కడప కార్పొరేషన్‌కు ఇద్దరు పంచాయతీ కార్యదర్శుల బదిలీ


కలికిరి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కడప రూరల్‌లో పనిచేస్తున్న ఇద్దరు పంచాయతీ కార్యదర్శులను మున్సిపల్ కార్పొరేషన్‌లోకి విలీనం చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. గ్రేడ్-పంచాయతీ కార్యదర్శులు కె.వి.కృష్ణా రెడ్డి, టి.రాధిక పనిచేస్తున్న గ్రామ పంచాయతీలు కార్పొరేషన్ పరిధిలో చేరినందువల్ల పంచాయతీ కార్యదర్శులను కూడా కార్పొరేషన్‌లో విలీనం చేయాలని పంచాయతీ రాజ్ కమిషనరు చేసిన ప్రతిపాదనలను ప్రభుత్వం ఆమోదించింది. కార్పొరేషన్‌లో వీరిద్దరినీ సూపరింటెండెంట్‌లుగా నియమించింది. ఈ మేరకు మున్సిపల్ వ్యవహారాలు, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు.

జీవో జారీ చేయాలి

కడప మారుతీనగర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి):ఆశా కార్యకర్తలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 62 సంవత్సరపు రిటైర్మెంట్ వయస్సు పెంపు, గ్రాట్యుటీ, మెటర్నిటీలకు జీవో జారీ చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ వెంకటసుబ్బయ్య, జిల్లా అధ్యక్షుడు గుంటి వేణుగోపాల్, ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు శాంతి, సుభాషిణి డిమాండ్ చేశారు. ఆ మేరకు శుక్రవారం మంగళగిరిలో ఉన్న వైద్యఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ రాష్ట్ర కమిషనర్ జి. వీరపాండియన్‌ను వారు కలిసి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కమిషనర్‌ను కలిసిన వారిలో ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మరియమ్మ, ఉపాధ్యక్షురాలు అనసూయ తదితరులున్నారు.

ప్రజాదర్బార్‌లో సమస్యల వెల్లువ

పులివెందుల, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం 4గంటల నుంచి పులివెందుల కార్యాలయంలో ఆయన ప్రజలకు అందుబాటులో ఉన్నారు. ఈ సందర్భంగా వివిధ మండలాల నుంచి వచ్చిన అభిమానులు,నాయకులు, కార్యకర్తలు బీటెక్ రవిని కలిసి వారి వారి సమస్యలను ఆయనకు విన్నవించుకున్నారు. అందుకు ఆయన వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చొరవ చూపారు. ఈ కార్యక్రమంలో బీటెక్ రవి సతీమణి లతారెడ్డి, వేంపల్లె మండల పరిశీలకుడు రఘునాథరెడ్డి తదితరులుపాల్గొన్నారు.


ప్రజల సమస్యలు వింటున్న బీటెక్ రవి

ప్రకటన

నా క్లైయింట్ అయిన శ్రీ మన్నిరు సూర్యనారాయణ తండ్రి సుబ్బరాయుడు, డోర్ నెం. 36/628-3, అశోక్‌నగర్, చిన్నచౌక్, కడప సిటీ వారి సూచనల మేరకు తెలియజేయ దం ఏమనగా, నా క్లైయింట్ కడప సిటీ, హనుమప్ప వీధి (మంచాల రామయ్య వీధి)లోని డోర్ నెం. 12/288గల ఇంటిని దస్తావేజు తేది : 09.04.2018 డాక్యుమెంట్ నెం. 2125/2018 ద్వారా శ్రీ కాసుల ఆదినారాయణ తండ్రి నారాయణగారి ద్వారా కొని యున్నారు. ఈ డాక్యుమెంట్‌కు సంబంధించిన జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ 22.03. 1988 డాక్యుమెంట్ నెం. 53/BKIV/1988ను 02.06.2025 తేదిన సదరు డాక్యుమెంటు ఇల్లు మారు చుండగా పోయినవి. ఎవరికైనా దొరికిన యెడల నాకు గాని, నా క్లైయింట్‌కిగాని అందజేయవలెను. పై తెలిపిన డాక్యుమెంట్ పై నా క్లైయింట్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, మండీ బజారు బ్రాంచి నందు తనఖా పెట్టి గృహ ఋణము తీసుకొనుచున్నారు. దీనిపై ఎవరికైనా అక్షేపణలు వున్న యెడల నాకు గాని, సదరు బ్యాంకు వారికి, నా క్లైయింట్‌కు గాని తెలియజేయవలెను. తరువాత ఎటువంటి తగాదా చేసిన చెల్లదు. సదరు డాక్యుమెంట్లపైన ఎవరైనా ఎటువంటి తప్పుడు లావాదేవీలు జరిపినా నా క్లైయింట్ తీసుకొను చర్యలకు బాధ్యులగుదురు.

యం. సాయి నిరంజన్ బాబు, B.A., B.L.
న్యాయవాది, కడప. సెల్ : 94403 53962

ఆమ్ ఆద్మీ పార్టీ

వేంపల్లె, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పేదలకు సరఫరాచేసే రేషన్ బియ్యం తూకాలలో డీలర్లు కోతలు విధిస్తున్నారని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కో-ఆర్డినేటర్ రహంతుల్లా, జిల్లా కో-కన్వీనర్ దాదాపీర్ అన్నారు. ఈ విషయమై శుక్రవారం స్థానిక తహసీల్దార్ హరినాథ్‌రెడ్డికి ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు వినతిపత్రం సమర్పించారు. డీలర్లు తూకాల వేసే సమయంలో ప్లాస్టిక్ బకెట్లలో బియ్యం వేసి తూకాలు వేయడం వలన రెండు నుంచి మూడు కేజీలు తగ్గుతున్నాయన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆప్ నాయకులు గౌస్, షఫీ,అహమ్మద్ పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

కడప నాగరాజుపేట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): జాతీయ విద్యుత్ భద్రత వారోత్సవాల సందర్భంగా విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన తగు జాగ్రత్తలు,సూచనలు తెలియజేస్తూ తయారుచేసిన గోడపత్రాలను శుక్రవారం విద్యుత్ అధికారులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో టౌన్, రూరల్ డీఈఈలు శేషారెడ్డి,లక్ష్మానాయక్,వెంకటేశ్వర్లు, రామచంద్రారెడ్డి, సుబ్రహ్మణ్యం, పాల్గొన్నారు.

సరస్వతి దేవికి వెండి వస్తువులు బహూకరణ

వేంపల్లె, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక గాండ్లవీధిలో వెలసిన శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యం దేవస్థానంలో ఉన్న సరస్వతి దేవికి వెండి వస్తువులు వితరణ చేశారు. వేంపల్లెకు చెందిన పుల్లగూర గోవిందనాథ చటర్జీ ధర్మపత్ని నాగవేణమ్మ వెండి ఆభరణాలు సమర్పించారని ఆలయ అర్చకుడు శేషగిరిరావు తెలిపారు. లక్ష విలువైన వెండి హస్తాలు, కర్ణాలు, బొట్టు, కళ్లు అందజేశారన్నారు. ఈ కార్య క్రమంలో ఆలయ ప్రతినిధి సాంబశివుడు, దాత కుటుంబ సభ్యులు గోపాల్, సుప్రజ, నాగేశ్వరరావు, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు

పెండ్లిమర్రి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి):దుకాణాల దారులు రైతులకు ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఏవో క్రిష్ణ సుమంత్‌రెడ్డి తెలిపారు.మండల పరిధిలోని ఎరువులు అమ్మే దుకాణాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు.ఎమ్మార్పీకి మాత్రమే ఎరువులను విక్రయించాలన్నారు.నందిమండలంలోని 1,2 రైతు భరోసా కేంద్రాలకు 4 యూనిట్ల యూరియా తెప్పించి రైతులకు పంపిణీ చేస్తున్నామని ఆయన తెలిపారు.

ఏడీఏగా నాగరాజు

సీకేదిన్నె, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కడప సంచార భూసార పరీక్ష కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకుడిగా మర్రిపాటి నాగరాజు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టి నమూనాలను శాస్త్రీయ పద్ధతిలో విశ్లేషణ చేసి కాలంలో రైతులకు భూసార పరీక్ష ఫలితాలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఏడీఏ నాగరాజుకు సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు.

రైతులకు అవగాహన కల్పించండి

సింహాద్రిపురం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రైతులు సాగు చేసిన పంటలకు భీమా ప్రీమియం చెల్లింపుపై రైతుల్లో అవగాహన కల్పించాలని ఏవో కల్యాణ్ కుమార్ సూచి ంచారు. శుక్రవారం సింహాద్రిపురం రైతు సేవా కేంద్రంలో సిబ్బందికి సమావేశం ఏర్పాటు చేశారు. పూర్తి వివరాలకు సంబంధిత రైతు సేవా కేంద్రాలలో సంప్రదించవచ్చన్నారు.ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పీఆర్ ఇన్‌చార్జ్ ఎస్ఈగా కాణిపాకం చంద్రశేఖర్‌రెడ్డి

కడప రూరల్, జూన్ 27(ఆంధ్రజ్యోతి) : పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ఇన్‌చార్జ్ ఎస్ఈగా కాణిపాకం చంద్రశేఖర్‌ను నియమిస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులను జారీచేసింది. ఈయన కడప ఈఈగా పనిచేస్తున్నారు. ఈ మేరకు అయనను ఇన్‌చార్జ్ ఎస్‌గా నియమిస్తూ అదనపు బాధ్యతలను అప్పగించింది. ఇక్కడ ఎస్ఈగా పనిచేస్తున్న జి.వి. శ్రీనివాసరెడ్డికి చీఫ్ ఇంజనీర్‌గా పదోన్నతి కల్పించడంతో ఈ మార్పు చోటుచేసుకుంది.

ప్రథమ చికిత్సపై అవగాహన పెంచుకోవాలి

సీకేదిన్నె, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రథమ చికిత్సపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి, రెడ్‌క్రాస్ సొసైటీ స్పెషల్ ఆఫీసర్ విశ్వేశ్వరనాయుడు తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం పవర్‌గ్రిడ్ కార్యాలయంలో శుక్రవారం ప్రథమ చికిత్సపై అవగాహన నిర్వహించారు. పవర్ గ్రిడ్ జనరల్ మేనేజర్ కుమార్ మాట్లాడుతూ పవర్‌గ్రిడ్ సిబ్బంది ప్రథమ చికిత్సపై అవగాహన ఉండడం ఎంతైనా అవసరమన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ ట్రైనర్స్ పవర్ గ్రిడ్ సిబ్బందికి ప్రథమ చికిత్సపై మాక్‌డ్రిల్ చేసి అవగాహన కల్పించారు. అనంతరం ఆవరణలో మొక్కలు నాటారు.

'బలిజలకు అన్యాయం జరిగితే ఉద్యమిస్తాం'

పులివెందుల రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఏ ప్రాంతంలోనైనా బలిజలపై అక్రమాలు, అన్యాయాలకు పాల్పడితే ఉద్యమిస్తామని రాయల్ పీపుల్స్ ఫ్రంట్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు తిరుమలశెట్టి రెడ్డిశేఖర్ రాయల్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక బలిజ సంఘం కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ పులివెందుల పట్టణానికి చెందిన బలిజసంఘం మాజీ అధ్యక్షుడు శ్రీపతి బాలుడు కుటుంబ సభ్యులను పరామర్శించామన్నారు. ఇటీవల జరిగిన భూకబ్జా వివరాలను, జరిగిన సంఘటనపై అడిగి తెలుసుకున్నామన్నారు. జనసేననాయకుడు వెంకటరమణ, ఆర్పీఎఫ్ పొలిటికల్ సెల్‌కన్వీనర్ జేఎస్ బాబు రాయల్, పులివెందుల సంఘ అధ్యక్షుడు గూడూరు ప్రసాద్,కార్యదర్శి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మహా యాగాలను దిగ్విజయం చేయండి

కడప కల్చరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): లోక కళ్యాణార్థం ఆధ్యాత్మవిద్యాప్రతిష్ఠానం ఆధ్వర్యంలో ఈనెల 28, 29 తేదీలలో నగర బ్రాహ్మణవీధి (ఉత్తరాదిమఠం)లో తలపెట్టిన మహా యాగాలను భక్తులు దిగ్విజయం చేయాలని ఆధ్యాత్మ విద్యాప్రతిష్ఠానం వ్యవస్థాపకుడు ఆచార్య మాళిగి విద్యానిధి పిలుపునిచ్చారు. ఆ మేరకు శుక్రవారం స్థానిక బ్రాహ్మణవీధిలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దశకోటి కృష్ణ మంత్ర జపమహాయాగము, సరస్వతీ మహా యాగాలను ఈనెల 29వ తేదీ ఆదివారం ఉదయం 7 గంటలకు చేపట్టనున్నట్లు వెల్లడించారు. కాగా ఈనెల 28వ తేదీ శనివారం గోపూజ కార్యక్రమంతో ప్రారంభమై సాయంత్రం 6 గంటలకు సత్యభామ రుక్మిణి సమేత శ్రీ కృష్ణపరమాత్ముని వివాహ మహోత్సవం కన్నుల పండువగా జరుగనుందన్నారు. సమావేశంలో ఆధ్యాత్మ విద్యాప్రతిష్ఠానం సభ్యులు నరహరి, కృష్ణారావు, సురేష్, మహిళా సభ్యులు రమాబాయి, వేదవతి, జయశ్రీ, సురేఖ, తదితరులు పాల్గొన్నారు.

కేసులు రాజీ అయ్యేలా సహకరించాలి

కడప రూరల్, జూన్ 27(ఆంధ్రజ్యోతి) : జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల మేరకు 5న ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌కు పోలీస్‌శాఖ నుంచి అధిక కేసులు రాజీ అయ్యేవిదంగా సహకరించాలని డీఎల్ఎస్ఏ చైర్మన్, జిల్లా ప్రధాన జడ్జి డాక్టర్ సి. యామిని పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కోర్టు ఆవరణంలోని న్యాయసేవా సదన్‌లో డీఎస్పీలతో ముందస్తు లోక్ అదాలత్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమీక్షలో కడప జిల్లా, అన్నమయ్య జిల్లాల డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



పర్యావరణాన్ని పరిరక్షించాలి

పెండ్లిమర్రి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి):ప్రతి ఒక్కరూ భవిష్యత్ తరాల కోసం పర్యావరణాన్ని పరిరక్షించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఇందిర తెలిపారు.వనం మనం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో అధ్యాపకులు,విద్యార్థులు కలసి మొక్కలు నాటారు. అలాగే గణిత అతిథి అధ్యాపక పోస్టుకు అర్హత కలిగిన వారు ఈ నెల 29 లోపు దరఖాస్తు చేసు కోవాలన్నారు.30న కళాశాల ఆవరణలో నిపుణుల కమిటీ ఎంపిక చేస్తుందన్నారు.



మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యం

లింగాల,జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన లింగాల గ్రామానికి చెందిన బంధం కుళాయప్ప అనే మతిస్థిమితం లేని వ్యక్తి ఈనెల 25వ తేదీ నుంచి కనిపించకుండా పోవడంతో శుక్రవారం ఆయన భార్య లక్ష్మీదేవి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాగా బుధవారం లక్ష్మీదేవి కూలి పనికివెళ్తూ కుమార్తె స్రవంతికి చెప్పి వెళ్లింది. ఆరోజు బయటికి వెళ్లిన కుళాయప్ప ఇంటికి రాకపోవడంతో గ్రామంలోను, బంధువులను విచారించిన ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆ మేరకు కేసు నమోదు చేశారు.


కుళాయప్ప

వృద్ధులు, వికలాంగులకు నిత్యావసర వస్తువుల పంపిణీ సక్రమంగా జరగాలి

చెన్నూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని చౌకదుకాణాల ద్వారా వారి వారి ప్రాంతాల్లోని వృద్ధులు, వికలాంగులకు నిత్యావసర వస్తువులపంపిణీ సక్రమంగా జరగాలని కడప ఆర్డీవో జాన్ ఇర్విన్ అన్నారు. చెన్నూరులో 60 ఏళ్లు దాటిన వృద్ధులు, వికలాంగులకు నిత్యావసర వస్తువుల పంపిణీ జరగడాన్ని శుక్రవారం ఆర్డీవో తనిఖీ చేశారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ప్రతి నెలా 25 నుంచి నెల చివరి వరకు నిత్యావసర వస్తువులు 60 ఏళ్లు దాటిన వారికి ఇంటి వద్దకే వెళ్లి పంపిణీ చేయాలని ఆదేశించడం జరిగిందన్నారు.కార్యక్రమంలో తహసీల్దారుసరస్వతి, ఆర్ఐకౌశిక్, వీఆర్వో భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో పోలీసులది ముందంజ

పులివెందుల, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు పోలీసులు ముందుంటారని పులివెందుల డీఎస్పీ మురళినాయక్ అన్నారు. శుక్రవారం పల్లెబాట కార్యక్రమం తొండూరు పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన వారితో మాట్లాడి వారి సమస్యను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ ఎన్‌వీ రమణ, తొండూరు ఎస్ఐ ఘనమద్దిలేటి, సిబ్బంది పాల్గొన్నారు.

మన చేతుల్లోనే...మలేరియా నిర్మూలన

చెన్నూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) :మలేరియా అనేది దోమల ద్వారా వచ్చే వ్యాధి అని అందరికీ తెలిసిన విషయమే. అయితే ఆ దోమలు పెరగకుండా నివారించడం అనేది మన చేతుల్లోనే ఉందని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని కనపర్తి, బలసింగాయపల్లె గ్రామాల్లో మలేరియా మాసోత్సవాలను పురస్కరించుకుని అక్కడ శుక్రవారం మలేరియాను ఎలా నివారించవచ్చు, దోమలు పెరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది సుబ్బరామయ్య, దివిజ, లక్ష్మీదేవి, ప్రమీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోండి

వేంపల్లె, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్ధయ్య పేర్కొన్నారు. శుక్ర వారం వేంపల్లె 1వ సచివాలయ పరిధిలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా లార్వా సర్వే నిర్వహించి, మురికి కాల్వల్లో నిలిచిన నీటి నిల్వలను తొలగించి పరిసరాల పరిశుభ్రత గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. దోమల వృద్ధిని నివారించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి బాబా ఫక్రుద్దీన్, హెచ్ఎస్ అంకయ్య, ఆరోగ్య కార్యకర్తలు లక్ష్మీదేవి, శిరీష, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.



శాకాంబరీదేవి అలంకారంలో పెద్దమ్మతల్లి



మైదుకూరు రూరల్, జూన్ 27(ఆంధ్రజ్యోతి) :ఆషాఢమాసం ప్రారంభమైన వేళ మొదటి శుక్రవారం స్థానిక పాతూరులో వెలసిన పెద్దమ్మతల్లి ఆలయంలో అమ్మవారిని శాకాంబరీదేవి అలంకారంలో అలంకరించారు. ఆలయ నిర్వాహకులు వేకువ జాము నుంచే పెద్దమ్మతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.పెద్దమ్మతల్లిని కూరగాయలు, ఆకుకూరలతో శాకాంబరీదేవిగా అలంకరించడంతో భక్తులు విరివిగా పాల్గొని అమ్మవారిని దర్శించుకొన్నారు.

కనకదుర్గమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు



అలంకారంలో కనకదుర్గమ్మ

బద్వేలుటౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఆషాఢమాసం ప్రారంభం సందర్భంగా శుక్రవారం పట్టణంలోని సబ్‌స్టేషన్ ఆవరణలో వెలసిఉన్న కనకదుర్గమ్మకు వేకువజామునుంచే ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని కర్పూరంతో ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం అమ్మవారికి పల్లకీసేవ నిర్వహించడంతో కొంత మంది మహిళలు అమ్మవారి మాలలు ధరించి పల్లకిసేవలో పాల్గొన్నారు. అనంతరం ఆలయకమిటీవారు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

రేపు ఏరువాక గంగమ్మ 28వ వార్షిక వేడుకలు



ఏరువాక గంగమ్మ

ఎర్రగుంట్ల, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్లలోని శాంతినగర్‌లో వెలసిన ఏరువాక గంగమ్మ ఆలయ 28వ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించేందుకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. ఇందులో భాగంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేస్తున్నారు. ఆదివారం ఉదయం 8గంటల నుంచి గణపతిపూజ, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, కలశ స్థాపన పూజలు నిర్వహిస్తున్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు కమిటీ చేస్తోంది. సాయంత్రం 3.30 గంటలకు అమ్మవారి ఊరేగింపు ఉంటుందని కమిటీ తెలిపింది. అమ్మవారికి ప్రత్యేక పూలాలంకరణ, ప్రత్యేక అలంకణ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

ఆటో డ్రైవర్ల తీరు మారదా..?

- ప్రధాన రోడ్లపై అడ్డదిడ్డంగా ఆటోల నిలుపుదల
- ట్రాఫిక్‌కు తప్పని తిప్పలు
- ప్రమాదాలు జరిగితేకాని స్పందించరా అంటున్న జనం

ప్రొద్దుటూరు అర్బన్ జూన్ 27(ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణ వీధుల్లో ట్రాఫిక్ గందరగోళానికి ఆటోలు ఒక ప్రధాన కారణమవుతున్నాయి. ట్రాఫిక్ నియమాలపై అవగాహన లేకపోవడమా లేక నిర్లక్ష్యమో తెలియదు కాని ఆటో డ్రైవర్లు ఆటోలను ప్రధాన రోడ్లపైనే అడ్డదిడ్డంగా నిలిపివేయడం. అనుచిత డ్రైవింగ్ ప్రవర్తనలు ప్రజలకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తున్నాయి. ప్రతి కూడలిలోనూ, బస్టాప్‌ల దగ్గర, పాత బస్టాండ్, బీవీఎస్ థియేటర్, అన్వర్ థియేటర్, ఆర్టీసీ బస్టాండ్, ఆస్పత్రుల వద్ద ఆటోలు నిలిపే దృశ్యాలు ఇబ్బందికరంగా ఉంటున్నాయి. ప్యాసింజర్ దొరికితే చాలు ఎక్కడైన వెనుకా ముందు చూడకుండా ఆగడంతో ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయి. కొన్ని సమయాల్లో ఎక్కడ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయపడిపోతున్నారు. ఒక వేళ ట్రాఫిక్ పోలీస్ జారీ చేసిన చలానా ఉంటే తప్ప కొందరైతే చెబితే వినే పరిస్థితి లేదు.



ప్రధాన రోడ్డుపైనే యుటర్న్ వద్ద అడ్డంగా తిప్పుతున్న ఆటో

ఆటో డ్రైవర్లకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలి

నగర పాలక సంస్థ వారు ఆటోడ్రైవర్లకు ప్రత్యేకంగా ట్రాఫిక్ శిక్షణ ఇవ్వడంతోపాటు జీపీఎస్ ఆధారంగా ఆటోలపై నిఘా పెట్టే టెక్నాలజీని వినియోగించుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ప్రజావేదికల ద్వారా సమస్య నియంత్రణకు పాటుపడాలని కోరుతున్నారు.

ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నాం



ప్రొద్దుటూరులో ట్రాఫిక్ నియంత్రణకు ఎప్పటికప్పుడు తనిఖీలు చేపడుతున్నాం. ప్రతి రోజూ 25వేల వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో ట్రాఫిక్ సమస్యగా మారింది. ఆటో డ్రైవర్లకు ఎప్పటికప్పుడు కౌన్సెలింగ్ ఇస్తున్నాం. పట్టణంలో పాతబస్టాండ్ ఎదురుగా, బీవీఎస్, ఆరవేటి థియేటర్లతోపాటు త్యాగరాజరెడ్డి హాస్పిటల్ వద్ద బస్సులు అధిక సమయం నిలిపివేయడం కూడా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి అధికారులు, ప్రజలు సహకరించాలి.

-దేవకుమార్, ట్రాఫిక్ సీఐ

పంచాయతీని శుభ్రపరిచిన అధికారులు



ఆయుష్మాన్ భవనంకు వెళ్లే దారిని శుభ్రం చేయించిన అధికారులు

ఖాజీపేట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పత్తూరు పంచాయతీలో రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్తాచెదారాలను శుక్రవారం అధికారులు పరి శుభ్రం చేయించారు. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో 'ఇదేనా స్వచ్ఛభారత్ కథనం రావడంతో ఎంపీడీవో వెంకటరమణ ఆదేశాల మేరకు పత్తూరు సెక్రటరి ఎ.శంకరమ్మ డోజర్ సహాయంతో పంచాయతీలోని చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీలోని ప్రజలు, రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయరాదని చెత్త సేకరణకు ప్రతి రోజు సిబ్బంది వస్తున్నారని వారికి అందించాలని అలా చేయకుండా ఎక్కడ పడితే అక్కడ చెత్త వేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. పంచాయతీ పరిధిలో తొట్లను ఏర్పాటు చేస్తామని అక్కడ మాత్రమే చెత్తను వేయాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మైదుకూరు రూరల్, జూన్ 27(ఆంధ్రజ్యోతి) :మండలంలోని వనిపెంట, ఆదిరెడ్డిపల్లె, నంద్యాలంపేట ఫీడర్ల కింద శనివారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు. మైదుకూరు 220కేవి సబ్‌స్టేషన్‌లో మరమత్తుల నిమిత్తం విద్యుత్ సరఫర నిలిపివేస్తున్నట్లు వారు తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి : డీఎస్పీ



మాట్లాడుతున్న డీఎస్పీ భావన, సీఐ మద్దిలేటి, ఎస్ఐ వెంకటరమణ

రాజుపాలెం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) :గ్రామాల్లో దొంగతనాలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ప్రొద్దుటూరు డీఎస్పీ భావన సూచించారు. శుక్రవారం టంగుటూరు గ్రామంలోని మదనగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో సైబర్ నేరాలు, దొంగతనాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ డబ్బులు, బంగారం ఇళ్లల్లో దాచుకోకుండా బ్యాంకుల్లో భద్రపరచుకోవాలని సూచించారు. సైబర్ నేరాలు ఎక్కువగా ఉన్నందున సెల్‌లు మెసేజ్‌లు వచ్చి ఓటీపీలు చెప్పమని అడిగితే చెప్పవద్దన్నారు. బ్యాంకులకు సంబంధించి ఓటీపీ నెంబర్లు ఎప్పుడూ అడగరన్నారు. మైనర్లను దృష్టిలో ఉంచుకుని వారికి వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ మద్దిలేటి, స్థానిక ఎస్ఐ కత్తి వెంకటరమణ, పోలీసులు, ప్రజలు పాల్గొన్నారు.

నడిరోడ్డుపై ఆటోలు నిలిపితే చర్యలు తప్పవు



ఆటో డ్రైవర్లకు జరిమానాలు విధిస్తున్న సీఐ రాజగోపాల్

బద్వేలుటౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : నడిరోడ్డుపై ఆటోలను నిలిపితే చర్యలు తప్పవని సీఐ రాజగోపాల్ హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని నాలుగు ప్రధాన రహదారుల్లో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రాజగోపాల్ మాట్లాడుతూ నడిరోడ్డుపై వాహనాలను నిలిపి ట్రాఫిక్ అంతరాయనికి పాల్పడిన వాహనాలకు జరిమానాలు విధించామన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలుపాటిస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా సహకరించాలన్నారు. వాహనాల తనిఖీల్లో పోలీస్ సిబ్బంది చెన్నారెడ్డి, వెంకటసుబ్బయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యాసామగ్రి వితరణ



విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న దృశ్యం

బద్వేలు, జూన్ 27 (ఆంధ్ర జ్యోతి): పట్టణంలోని ఎరకల పాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు తిరుమల ట్రస్ట్‌వారు విద్యాసామగ్రి అందించారు. వాటిని అర్బన్ సీఐ రాజగోపాల్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బసవరాజు, అందజేశారు. ఈ సందర్భంగా వారు తిరమల ట్రస్ట్ వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు, ఎక్సైజ్ సీఐ సీతారామిరెడ్డి, పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో: ఎర్రగుంట్ల మహేశ్వరనగర్‌లోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు టీడీపీ నాయకుడు సిరిగిరెడ్డి జగదీశ్వర్‌రెడ్డి శుక్రవారం హెచ్‌ఎం రఘురామిరెడ్డితో కలిసి విద్యా సామగ్రి పంపిణీచేశారు. విద్యార్థుల అభివృద్ధికోసం మరింత సహకారం అందిస్తానని జగదీష్ పేర్కొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్‌గా గురుమూర్తిరెడ్డి

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సివిల్ ఇంజనీరింగ్ విభాగం హెచ్‌వోడీ పి.గురుమూర్తిరెడ్డి శుక్రవారం ప్రిన్సిపాల్‌గా (ఎఫ్ఏసీ) బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల హెచ్‌వోడీలు, అధ్యాపకులు, బోదనేతర సిబ్బందితో సమావేశం నిర్వహించి కళాశాల అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. అనంతరం ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన గురుమూర్తిరెడ్డిని అధ్యాపకులు, బోదనేతర సిబ్బంది ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌వోడీలు అశోక్‌బాబు, మంజునాథ్, వీరభద్రారెడ్డి, విజయకుమార్ పాల్గొన్నారు.

కష్టపడేవారికి సముచిత స్థానం కల్పించడమే లక్ష్యం

కాశినాయన జూన్27(ఆంధ్రజ్యోతి): టీడీపీలో కష్టపడి చురుకుగా పనిచేసేవారికి సముచిత స్థానం కల్పించాలన్నదే సమావేశ ప్రధాన ఉద్దేశ్యమని కాశినాయన మండల టీడీపీ పరిశీలకుడు ఉమాకాంత్ పేర్కొన్నారు. నర్సాపురం శ్రీరామస్వామి కళ్యాణ మంటపంలో శుక్రవారం పార్టీ అబ్జర్వర్ అధ్యక్షతన మండల టీడీపీ నాయకులు కార్యకర్తల సమావేశం జరిగింది. సమావేశంలో పార్టీ పరిశీలకుడు ఉమాకాంత్ మాట్లాడుతూ పార్టీ అధిష్టానం వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని టీడీపీని సంస్థాగతంగా బలోపేతం చేయడం కోసం కార్యకర్తల సమావేశం ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. ఇందులో పార్టీకోసం కష్టపడి పనిచేసిన వారు ఎవరు వారికి ఎలాంటి పదవులు కట్టబెట్టాలి మండల కమిటీలో ఎవరికి ఎలాంటి పదవి కేటాయించాలన్న దానిపై మీ అందరి అభిప్రాయాలను లిఖితపూర్వకంగా తీసుకొని పార్టీ రాష్ట్ర అధిష్టానానికి బద్వేల్ అధినాయకత్వానికి అందిస్తామన్నారు. ఇంతలో ఓకార్యకర్తలేచి ఒక నాయకుడికి అనుకూలంగా పదవి కట్టబెట్టాలని జైకొట్టడంతో వివాదం చెలరేగింది. దీంతో సీఐ శ్రీనివాసులు నర్సాపురం పోలీసులు జోక్యంచేసుకొని ఎలాంటి ఘర్షణ చోటుచేసుకోకుండా నాయకులకు సర్ధిచెప్పడంతో సమావేశం ముగిసింది. ఈకార్యక్రమంలో కడప టీడీపీ ఉపాధ్యక్షుడు బంగారు గుర్విరెడ్డి, మండల టీడీపీ నాయకు డు బసిరెడ్డి రవీంద్రారెడ్డి, క్రిష్ణారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, బి.వెంకట్రామిరెడ్డి(సీడ్స్)రోహిత్‌రెడ్డి, పోలిరెడ్డి, జయరామిరెడ్డి, విజయకుమార్‌రెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిర్ణయం అధిష్టానందే..

పోరుమామిళ్ల, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : పార్టీ సంస్థాగత ఎన్నికలకు సంబంధించి కన్వీనర్ల నియామకం అధిష్టానందేనని పోరుమామిళ్ల టీడీపీ సంస్థాగత ఎన్నికల పరిశీలకుడు మేకల బాబు అన్నారు. శుక్రవారం పార్టీ సంస్థాగత ఎన్నికలకు సంబంధించి అభిప్రాయ సేకరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి సంబంధించి 59 పోలింగ్ బూత్‌లున్నాయని, బూత్ కమిటి సభ్యుల నిర్ణయం సర్పంచ్‌ల నిర్ణయాన్ని బద్వేలు టీడీపీ ఇన్‌చార్జి దృష్టికి అధిష్టానం దృష్టికి తీసుకువెళతామన్నారు. అనంతరం పోరుమామిళ్ల మేజరు పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్ ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు భైరవ ప్రసాద్, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ చెరుకూరి చెన్నరాయుడు, కొండా రామక్రిష్ణారెడ్డి, కల్లూరి వెంకటక్రిష్ణారెడ్డి, నారాయణరెడ్డి, చంద్రయ్య, మస్తా న్, వెంకటరెడ్డి, సోమిరెడ్డి, సెట్టెం ప్రతాప్, మల్లిఖార్జునరెడ్డి, వెంకటసుబ్బయ్య, ఇమాంహుసేన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్యదర్శుల సామూహిక సెలవు

చాపాడు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 18 మంది గ్రామకార్యదర్శులు సెలవు పెట్టినట్లు ఏవో రామానుజన్ తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలోని ఏవోకు వారు ఒక వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం తమపై పని ఒత్తిడి ఎక్కువగా చేస్తోందని గ్రామ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేశారు.

అభివృద్ధి పనులకు ప్రాధాన్యం

దువ్వూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎంపీడీవో రామకృష్ణయ్య తెలిపారు. మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపీపీ జయచంద్రారెడ్డి అధ్యక్షతన స్థానిక సభాభవనంలో జరిగింది. ఈ సందర్భంగా మండల ఇంజనీరింగ్ అధికారి సుబ్రమణ్యం మాట్లాడుతూ ఫేజ్-1 కింద రూ.2 కోట్లతో 41 పనులు మంజూరు కాగా 38 పనులు పూర్తయినట్లు చెప్పారు. ఫేజ్-2 కింద 19 గ్రామాల్లోరూ.1.26 కోట్లతో సీసీ రోడ్లు, రూ.40 లక్షలతో సుగాళితాండాకు బీటీ రోడ్డు మంజూరైనట్లు చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దారు సంజీవరెడ్డి, అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల కృషి అభినందనీయం

కలసపాడు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): తెల్ల పాడు పాఠశాల ఉన్నత పాఠశాలగా అప్‌గ్రే డ్ చెందడంలో ఉపాధ్యాయులు శేఖర్‌బాబు, రమాదేవి, వెంకటసుబ్బయ్యల కృషి ప్రశంస నీయమని ఎస్టీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి రమణారెడ్డి అన్నారు. బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు శుక్రవారం హెచ్‌ఎం ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో సన్మానించారు. ఎస్ఎమ్‌సీ ఛైర్మన్ భాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచు ఈశ్వర్‌రెడ్డి, ఎస్టీయూ నాయకులు ఉపాధ్యాయులు, సచివాలయసిబ్బంది పాల్గొన్నారు.

ట్యాబ్‌లు పంపిణీ

జమ్మలమడుగు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మెప్మా కార్యాలయంలో శుక్రవారం 32 ట్యాబ్‌లను టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, కమిషనర్ వెంకటరామిరెడ్డి మెప్మా, ఆర్పీలకు ఎండీ, పీడీ సహకారంతో అందించినట్లు తెలిపారు. ఈ ట్యాబ్‌ల ద్వారా మెప్మా యాక్టివిటీస్, ఆర్పీలు వినియోగించుకుని మెప్మా విధులు సక్రమంగా నిర్వర్తించాలన్నారు. కార్యక్రమంలో మెప్మా ఆర్పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

సగిలేరు గురుకులం తరలింపును వెంటనే ఆపాలి

●పాఠశాలను తరలించేందుకు ఒప్పుకోం : విద్యార్థుల తల్లిదండ్రులు



సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల

బి.కోడూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : సగిలేరు వద్ద ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల తరలింపును వెంటనే ఆపాలని విద్యార్థుల తల్లిదండ్రులతోపాటు స్థానిక ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. 1992 నుంచి నడుస్తున్న సగిలేరు గురుకుల పాఠశాలలో ఐదో తరగతి నుంచి ఇంటర్ వరకు తరగతులు నడుస్తున్నాయని. ఇందులో దాదాపుగా 300 మంది విద్యార్థులు విద్యన భ్యసిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని విద్యార్థులకు వస తులు కల్పించడంతోపాటు బద్వేలు నియోజకవర్గంలోని అట్లూరు, గోపవరం, బి.కోడూ రు. పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన మండలాలకు చెందిన విద్యార్థులు విద్యన భ్యసించేందుకు తోడ్పడాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. కాగా బద్వేలు నియోజకవ ర్గంలో సగిలేరు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఒకే ఒక్కటి. ఆ పాఠశాలను తరలిస్తే సహించేదిలేదని ప్రజలంటున్నారు.

ఇన్‌చార్జి మినిస్టరు, కలెక్టర్‌తో మాట్లాడా: రితేష్‌కుమార్‌రెడ్డి

సగిలేరు గురుకుల పాఠశాలను తరలిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు బద్వేలు టీడీపీ ఇన్‌చార్జి రితేష్‌కుమార్‌రెడ్డితో మొరపెట్టుకోగా, ఆయన జిల్లా ఇన్‌చార్జి మినిస్టరు సవిత, జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌తో మాట్లాడారు. వారు సానుకూలంగా స్పందించారని ఆ గురుకుల పాఠశాల అక్కడే ఉండేందుకు ఉన్నతాధికా రులతో మాట్లాడుతానని వారికి హామీ ఇచ్చారు. అంతేకాకుండా సాంఘిక సంక్షేమ శాఖ మినిస్టరుతో మాట్లాడేందుకు ఆయన విజయవాడకు కూడా వెళ్లినట్లు తెలిసింది. కాగా సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను పక్క నియోజకవర్గానికి తరలించేందుకు ఒప్పుకోమని మండల టీడీపీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి తెలిపారు.

సగిలేరులోనే పాఠశాలను కొనసాగించండి

బ్రహ్మంగారిమఠం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : బద్వేలు నియోజకవర్గంలోని సగిలేరు గురుకులం పాఠశాలను జిల్లా కలెక్టరు స్పందించి యథావిధిగా కొనసాగించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎద్దు రాహుల్ కోరారు. పాఠశాలను తరలిస్తే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు అజ య్, రాజరుశేఖర్, నాయకులు లోకేశ్ పాల్గొన్నారు.

స్మార్ట్‌మీటర్ల బిగింపును అడ్డుకుంటాం

బ్రహ్మంగారిమఠం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రప్రభుత్వం బలవంతంగా స్మార్ట్ మీటర్లను బిగిస్తే అడ్డుకుంటామని సీపీఎం మండల కార్యదర్శి గండి సునీల్‌కుమార్ హెచ్చరించారు. బ్రహ్మంగారిమఠం మండలంలో శుక్రవారం పాతూరు. అంబేడ్కర్‌నగర్, రవీంద్రనగర్‌లోని ప్రతి ఇంటింటికీవెళ్లి స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా ప్రజలకు అవగాహన కల్పించి స్టిక్కర్లను అతికించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి నేతలు విద్యుత్ ఛార్జీలు పెంచబోమని, స్మార్ట్‌మీటర్లు బిగించమని హామీ ఇచ్చి నేడు అధికారంలోకి వచ్చాక అందుకు భిన్నంగా ప్రవర్తిస్తుండడం దారుణమన్నారు. లోకేశ్‌పాదయాత్రలో స్మార్ట్‌మీటర్లను పగలగొట్టాలని ఇచ్చిన పిలుపును మరిచిపోయారా అని ప్రశ్నించారు. వెంటనే స్మార్ట్‌మీటర్ల బిగింపును మానుకోవాలని సెకీ ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు గోవింద్, సుబ్బమ్మ, అజయ్, కార్యకర్తలు అరవింద్, దేవా పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన



జాబ్‌మేళాకు హాజరైన వారికి పేర్లు నమోదు చేసుకుంటున్న అభ్యర్థులు

జమ్మలమడుగు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలోని శ్రీనివాస డిగ్రీ కళాశాలలో శుక్రవారం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. ఈ జాబ్‌మేళాను టీడీపీ ఇన్‌చార్జి దేవగుడి భూపేశ్‌రెడ్డి, కళాశాల కరస్పాండెంట్ తాతిరెడ్డి సూర్యనారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా భూపేశ్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల అభివృద్ధి కోసందృష్టి సారించిందన్నారు. జాబ్‌మేళాలో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి దాదాపు 540 మంది అభ్యర్థులు హాజరు కాగా 286 మంది అభ్యర్థులకు సెలెక్టు లెటర్స్ అందించినట్లు కళాశాల కరస్పాండెంట్ తాతిరెడ్డి సూర్యనారాయణరెడ్డి విలేకరులకు తెలియజేశారు. జాబ్‌మేళాలో 15 కంపెనీలవారు పాల్గొన్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కడప జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి శ్రీనివాసులరెడ్డి, డీఆర్‌డీఏ అధికారి పృథ్వీ, తదితర కంపెనీలవారు, అభ్యర్థులు, తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా కబ్జాలకు అడ్డుకట్ట : టీడీపీ

బద్వేలుటౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వంలో పార్టీలకు అతీతం గా కబ్జాలకు అడ్డుకట్ట వేస్తున్నారని బద్వేలు టీడీపీ మండల అధ్యక్షుడు రవి కుమార్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు వెంగల్ రెడ్డి, రామచంద్రారెడ్డి, మిత్తికాయల రమ ణలు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ చింతల చెరువు పంచాయతీలోని బయనపల్లె చెరువు 25/బి సర్వేనెంబర్‌లో వైసీపీ నాయకులు గతంలో కబ్జాలుచేసి అక్రమకట్టడాలు కట్టుకొని విలాసవంతమైన భవ నాలను ఏర్పాటు చేసుకున్నారని ఆరోపించారు, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పార్టీలకు అతీతంగా కుంటలు, చెరువులు, ప్రభుత్వస్థలాల్లో అక్రమ కట్టడాలపై అధికారులు ఉక్కుపాదాన్ని మోపుతున్నారన్నారు. అధికారులు అక్రమ కట్టడాలను కూల్చివేస్తే రితేష్‌కుమార్‌రెడ్డిపైన నిందలు మోపడం వైసీపీ నాయకులకు తగదన్నారు. ఎమ్మెల్యే సుధా, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ రాజగోపాల్‌రెడ్డిలు కబ్జాదారులకు వెన్ను దన్నుగా ఉన్నారని వారు విమర్శించారు. కార్యక్రమంలో రామిరెడ్డి, రమణారెడ్డి, మణ్యం సుధాకర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, మల్లేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే సహించేదిలేదు

రాజుపాలెం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) :గ్రామ సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే సహించేదిలేదని ప్రజలకు జవాబుదారీతనంగా పనిచేయాలని ఎంపీడీఓ ఎం.రామనాధరెడ్డి సూచించారు. శుక్రవారం మండల పరిషత్ సభాభవనంలో పంచాయతీకార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వం తెలిపిన సర్వేలు సకాలంలో పూర్తి చేసి. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా పాటుపడాలన్నారు. ఎవరైనా వృద్దులు వచ్చినప్పుడు వారిని కూర్చోబెట్టి సమస్యలు పరిష్కరించాలన్నారు. సిబ్బంది సెలవుపై వెళ్లేటప్పుడు అధికారులకు తెలపాలన్నారు.కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ షాకీర్ ఆలీఖాన్, పంచాయతీ కార్యదర్శులు గ్రామ సచివాలయ కార్యద్శులు పాల్గొన్నారు.

గాండ్ల కార్పొరేషన్‌కు చైర్మన్, డైరెక్టర్లను నియమించాలి

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): అఖిలగాండ్ల తెలికుల వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు చైర్మన్, డైరెక్టర్లను నియమించాలని అఖిలగాండ్ల తెలికుల సంక్షేమ సంఘం నాయకులు కోరా రు. ఆ మేరకు శుక్రవారం తహసీల్దారు గంగయ్యకు వారొక వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు జి.నాగయ్య మాట్లాడుతూ గాండ్ల తెలికుల కులస్థులు మొదటి నుంచి తెలుగుదేశం ప్రభుత్వానికి అండగా ఉన్నారని ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా అఖిలగాండ్ల తెలికుల వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు చైర్మన్, డైరెక్టర్లను నియమించకపోవడం శోచనీయమన్నారు. సంఘం ఉపాధ్యక్షుడు జి.సి.పుల్లయ్య, నల్లం నాగభూషణం, సుబ్బయ్య, శివ, ఆంజనేయులు, శ్రీనివాసులు, సురేంద్ర, తులశయ్య పాల్గొన్నారు.

జీఎన్ఎస్ఎస్ కాలువలకు భూమి పూజ

ఎర్రగుంట్ల, జూన్ 27(ఆంధ్రజ్యోతి): గాలేరు-నగరి సుజల స్రవంతి కాలువలకు జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి సి.భూపేష్‌రెడ్డి శుక్రవారం భూమి పూజ చేశారు. గతంలో ఈ కాలువలు అర్ధాంతరంగా ఆగిపోయిన సంగతి తెలిసింది. ముద్దనూరు మండలంలోని మాదన్నగారి పల్లె, ఎర్రగుంట్ల మండంలోని రంగసాయిపురం గ్రామాల మధ్యలో ఈ కాలువ పనులకు పనః ప్రారంభోత్సవ భూమి పూజను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కూటమి ఇన్‌చార్జి మధుసూధన్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

సామూహిక నట్టల నివారణ మందులు పంపిణీ

ముద్దనూరు జూన్27(ఆంధ్రజ్యోతి):మండల పరిధి మంగపట్నం, యామవరం గ్రామాల్లో శుక్రవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సామూహిక నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఏడీ వాసాశ్రీనివాస ఆధ్వర్యంలో దాదాపు 2800 గొర్రెలు, 870 మేకలకు నట్టల నివారణ మందు త్రాపించారు. మండలంలోని అన్ని గ్రా